# దండోద్దండ

ఒక్కొక్కరి కొక్కొక్క అలవాటు... పోనీ... సరదా. ఆ సరదాకి అర్థమూ ప్రయోజనమూ కనిపించక పోవచ్చు పైవారికి. మీరు నమ్మలేకపోవచ్చు కానీ నా మిత్రుడొకడు సినిమా ప్రారంభానికి ముందు వేసే 'ఆట సమయమున నిశ్శబ్దముగా ఉండవలెను', 'హాలులో పొగత్రాగరాదు', 'మా రాబోవు చిత్రాలు' వంటి స్లయిడ్లను పైకి చదివి అమందానందం పొందేందుకే సినిమాలకు వెళ్లేవాడు. అతనికి – అసలు కంటే వడ్డీ ముద్దు అన్నట్లు అసలు సినిమా కంటే యీ స్లయిళ్లే అధికాకర్షణ అని అతనే చెప్పేవాడు. నాకూ – పైవూరు వెళ్లినప్పుడు... అక్కడ తీరికగా వీధుల వెంట విహరించే సావకాశం కలిగితే... రోడ్డుకటూ యిటూ ఉన్న షాపుల బోర్డులు ఒక్కటీ విడవకుండా చదువుకుంటూ వెళ్లడం అలవాటు. పోనీ... సరదా. "అదేమిటి? చిన్నపిల్లల్లా..." అని మిత్రులు గేలి చేయకపోలేదు. కాని... నేను మారలేకపోయాను. అలవాట్లు ఒకంతట అంతరించవు కదా? మనిషంటేనే కొన్ని బలహీనతల పుట్ట మరి!

తొలిసారిగా విజయవాడ వచ్చాను. గాంధీనగరం రోడ్డుమీద తీరిగ్గా నడుస్తున్నాను – అలవాటు గానే బోర్డులు చదువుకుంటూ. ఫిలిమ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు... హొటళ్లు... ఫ్యాన్సీ షాపులు.. షేర్ బ్రోకర్ల ఆఫీసులు... ఎన్నెన్ని బోర్డులో! నాకు విందుభోజనం చేస్తున్నట్లే ఉంది. తీరిగ్గా నడుస్తున్నాను దేనినీ విడచిపెట్టకుండా చదువుతూ. కాని... సరిగ్గా అ మలుపు దగ్గర.. ఆ బోర్డు చూసి... నా కాళ్లు ఆగిపోయాయి. "డీలక్స్ సన్మాన కేంద్ర్" – ఇచ్చట సన్మానములు దొరకబడును. తుళ్లిపడ్డాను – గుండెల మీద గుద్దినట్లయీ, చెంపమీద ఛెళ్లున చరచినట్లయీ. నాలోని వ్యాకరణవేత్త విలవిలలాడిపోయాడు. చెప్పడం మరిచాను. పూర్వాశ్రమంలో నేను తెలుగు మాస్టార్ని. డీలక్స్ – ఆంగ్ల పదం. సన్మాన– సంస్కృతం. కేంద్ర్ – హిందీ. మూడు భాషలని సంకరం చేస్తూందీ బోర్డు. పోనీ– తెలుగయినా బతకనిచ్చిందా అంటే... 'సన్మానములు దొరకబడును' అంటూ అపభ్రంశపు తెలుగులో ఆ తోక. ఏం ప్రయోగం! నాకు కడుపులో తిప్పేస్తూంది. గుండెల్లో మండిపోతూంది. ఎవడీ ప్రబుద్ధుడు– ఇలాటి బోర్డు తగిలించిన వాడు?

ఇప్పుడు ఆంధ్రులకీ అస్మదీయులకీ రాజధాని నగరమైనా ఒకప్పుడు మహమ్మదీయుల పాలనలో ఉండి ఉండేది కనుక – హైదరాబాదు క్షురశాలలకు 'ఇచ్చట మీ తల అందముగా నరకబడును' వంటి నవ్వు తెప్పించే తెలుగు బోర్డులుండినా అది వేరే విషయమూ, క్షమార్హమూ, కాని... ఇది– తెలుగుదేశపు నడిబొడ్డు. ఇది– విజయవాడ. మల్లాది రామకృష్ణశాస్త్రి గారి నవలకే శీర్షికగా వెలసిన 'కృష్ణాతీరం...' విశ్వనాథ వారు విహరించిన విజయవాడ! ఇక్కడ ఇలాటి అస్తవ్యస్తపు.. దోషభూయిష్ఠమైన బోర్డు పెట్టిన పుండాకోరెవడు? పింజారీ గాడెవడు? అసలే నాకధిక రక్తపు పోటు. దానిని శతగుణితం చేస్తూందీ బోర్డు. కారం రాసుకున్నట్లే మండిపోతూంది వొళ్లు. తాడో పేడో తేల్చుకుందామనీ... వాడికింత బుద్ధీ జ్ఞానమూ నప్పుదామనీ పెద్దపెద్ద అంగలేసుకుంటూ చిన్నపాటి కార్యాలయంలా కనిపిస్తున్న ఆ గదిలోకి నడిచాను. మాస్టార్లు ఎక్కడ తప్పు కనిపించినా వదలరు. అది– వృత్తిరీత్యా సంక్రమించే 'దుర్లక్షణం'. నేను ద్వారం దాటి లోపలకడుగు పెట్టానో లేదో... కాని

"రండి... స్వాగతం... మీకెటువంటి సన్మానం కావాలి? ఆర్డినరీ? డీలక్స్? సూపర్? సూపర్ డూపర్? ఆసీనులై బల్ల మీదున్న కరపత్రాలు చూస్తూండండి. సన్మానం జరిగే విధానాలూ... ఒక్కోదానికీ అయ్యే ఖర్చు వివరాలూ ఉన్నాయి వాటిలో. పిండి కొద్దీ రొట్టె. రేటు కొద్దీ సన్మానం" అంటూ వినిపించిందో కంఠం - నేనున్న గది ద్వారానికున్న తెరవెనుక నుంచి అటు చూశాను. తెరలోంచి బాగానే కనిపిస్తూందా గది. అక్కడ పుస్తకాల బీరువాలో ఏదో వెదుకుతూ ఒకాయన... పెద్దవాడిలాగే ఉన్నాడు.

"నేను సన్మానం చేయించుకునే స్థితికి దిగజారి రాలేదు. ఈ డీలక్స్ సన్మాన కేంద్ర్ - ఇచ్చట సన్మానములు దొరకబడును- కి యజమానీ మీరే ఐతే... మీకు సన్మానం చేద్దామని వచ్చాను" అన్నాను వీలయినంత హేళనగానూ, కటువుగా కూడా. "ఏమిటీ? ఏమిటంటున్నారూ? నాకు సన్మానం చేస్తారా!" నవ్వేస్తూ.. "పెళ్లిళ్లు చేసే పురోహితుడిని. దంతాలు పీకే దంత వేదాంతిని..." అని నవ్వు కొనసాగించాడతను. ఆయన మాట పూర్తి చెయ్యనివ్వలేదు నేను. "పురోహితుడూ పెళ్లి చేసుకోవలసిన అవసరం అవశ్యం వచ్చి తీరుతుంది. దంత వైద్యుడెంతటివాడయినా అతనికీ పన్ను పీకించుకోవలసి రావచ్చు. తానెన్ని క్షవరాలు చేసిన క్షురకుడయినా తన క్షవరం తాను చేసుకోజాలడు కదా? తెర వెనుక బాగోతానికి త్వరగా స్వస్తి చెప్పి తమరు సత్వరం రండి. మీకు సన్మానం చేసేసి నా తోవన నేను చక్కా పోతాను" కసురుతున్నట్లే అన్నాను.

"వొస్తున్నాను... వచ్చేస్తున్నాను... ఇంతకీ నాకెందుకీ సన్మానం?" అంటాడే కానీ రాడే. "మీ బోర్డులోని... పేరులోని... భాషా సంకరానికీ మాతృభాషా మర్డరుకీ. తెరలోంచి కనిపిస్తున్నా మీరు పెద్దవారిలాగే ఉన్నారే. మీవంటి పెద్దవారికి ఇటువంటి భాషాద్రోహ నేరం తగునా?" తగులుకున్నాను - చల్లకొచ్చి ముంతదాచే తత్వం కాదు కనుక. అయ్యొచ్చే వరకూ అమావాస్య ఆగనట్లే ఆయన ఆ తెర వెనుక నుంచి వచ్చే వరకూ నా ఆగ్రహమూ ఆగలేదు.

"అదా! అదీ... నేటి వ్యాపార ప్రకటన చిట్కా..." నవ్వుతూనే అన్నాడాయన - బీరువా వేపునుంచి నావేపు ముఖమేనా తిప్పకుండా.

"వంకలేనమ్మ డొంక పట్టుకుని ఏడిచిందట." చురక వేశాను.

"ఎంత మాత్రమూ కాదు. మీరారోపించిన భాషా ద్రోహాలు ఎరిగి చేసినవే. రోజులనెరిగి చేసినవే. ఒకప్పుడు సంగీతం అంటే మాధుర్యమూ శ్రావ్యతా. మరి ఈ మధ్య పాటలు చిత్తగిస్తున్నారా? అపశ్రుతులే అత్యంత ఆదరణ పొందుతున్నాయి. కంఠం ఎంత అసహ్యంగా ఉంటే సినిమా పాట అంత హిట్టు. అలాగే భాష కూడానూ. తప్పులకే కిరీటాలు. వాక్యం ఎంత అవలక్షణంగా ఉంటే అంత గొప్ప. ఈ కాలపు పోకడలు ఇలాగే వున్నాయనే ఆ పేరూ అవీ అలా రాయించాను, సంస్కృత పండితుడినయి వుండి కూడా. మీరెవరు? భాషనీ దోషాల్నీ పట్టుకుని వేలాడుతున్నారంటే... బహుశా బడిపంతులా?"

"బహుశా ఏం ఖర్మ? కచ్చితంగా బడిపంతులినే. తెలుగు భాషలో దోషాలను పంటికింద రాయిలా భావించి బాధపడే బడిపంతులినే. మొన్ననే బలవంతంగా పదవీవిరమణ చేయించింది ప్రభుత్వం. సంస్కృత పండితులంటున్నారే... తమరి నామధేయం?"

"పతంజలి" అంటూ ఆయన తెరవెనుక నుండి బయటకొచ్చారు. ఇద్దరమూ ఒకరి మొకాలొకరం చూసుకున్నాం. "నువ్వా!" "నువ్వేనా!"

పాతమిత్రులం గాఢంగా ఆలింగనం చేసుకున్నాం. పదిహేనేళ్ల కబుర్లు కలబోసుకున్నాక నేనడిగాను మళ్లీ. "చెప్పు... అలనాటి సంస్కృత పండితుడేమిటి? ఈనాటి సన్మాన కేంద్ర యజమాని అవతారమేమిటి? కథాకమామీషూ చెప్పు." నా ఆవేశమూ ఉద్రేకమూ చల్లారిపోయాయి.

"దేవుడికి దశావతారాలో ఏకాదశావతారాలో సరిపోతాయేమో కానీ మనిషికి మనుగడ సాగించడానికి ఎన్నవతారాలూ సరిపోవేమో. నీకు బదిలీ అయ్యి మనం విడిపోయిన అయిదేళ్ళకే నాకు బలవంతపు పదవీ విరమణ. జీతమే చాలని సంసారానికి పింఛనేమూలకి? పిల్లలు అంది రాలేదు. విజయవాడ పెద్ద పట్టణం కదాని పొట్టా, ప్రావిడెంటు ఫండూ చేతపట్టుకుని ఇక్కడ చేరాను. సంస్కృతానికీ సంస్కారానికీ కాలం చెల్లిపోయింది కదా? నాచేత ఎవరూ సంస్కృత పాఠాలు చెప్పించుకుందుకు ముందుకు రాలేదు. అయితే ఈ పట్నం నాకొక జీవిత సూత్రాన్ని అకళింపుకి తెచ్చింది."

"ఏమిటి?"

"మనుషుల్నీ వారి మేథలనీ సంపన్నం చేయడం ద్వారా కాక బలహీనుల్ని చేయడంలోనే మనిషి బతక గలుగుతాడనీ అంటే – మనిషి ఎదుటి వారి బలహీనతలని పెంచడం ద్వారానే తాను బాగుపడగలడని. ఆలోచనలో పడ్డాను. మనిషిలోని ఏ బలహీనతని నేను బతకాలి అని" ఆయన కంఠంలోని ఎంతో ఆవేదన. పాప భావం. ఆశ్చర్యంగా వింటున్నాను. అతని మీద జాలేస్తూంది.

"నీకు జ్ఞాపకం ఉండే వుంటాడు – మధుసూదనం."

"ఔను అతని చేతిరాత ముత్యాల్లా ఉండేది. అది నలుగురూ గుర్తించాలని ఎక్కడ పడితే అక్కడ ఏవేవో రాసేవాడు. పిల్లల పుస్తకాలు తీసుకుని అట్టలమీద వారి పేర్లు చెక్కేవాడు..." అలాగే సత్యనారాయణ... పాటలు పాడేవాడు... సందర్భమా అసందర్భమా అని చూడకుండా ఎదుట ఒక్క మనిషున్నా సరే కంఠం సారించేవాడు. ఎక్కడూ ఉన్నా తనకి తానే పాడేసుకునేవాడు"

"ఔను"

"వీళ్ళని బట్టి నేనర్థం చేసుకున్నదేమిటంటే... మనిషి ప్రాథమికావసరాల తరవాత పాకులాడేది గుర్తింపుకోసమే అని. గుర్తింపుకోసమే కదా. కదా రచయితలూ కళాకారులూ, రాజకీయ నాయకులూ అవ్వాలని మనుషులెన్ని అడ్డదారులయినా తొక్కేది?"

"నిజమే. ఒక్కొక్కరి విషయంలో డబ్బు కంటే కూడా యీ కండూతే పెద్దపాత్ర వహిస్తుంది. గుర్తింపు అనేది సహజంగా రావాలి. ప్రతిభుంటే అలాగే వొస్తుంది..."

"కాని... మనిషి అంతవరకూ ఆగలేదు. ఇది వేగ యుగం కదా? నిజానికి నాటి మనిషి కోరుకునేది గుర్తింపే తప్ప ప్రతిభ కానేకాదేమో. ఎలాగో ఒకలా నలుగురి ముందూ సెబాసనిపించేసుకోవాలి."

ఔను ఎక్కువ మంది అంతే. మా వూళ్ళో... పేపరులో పేరు వేయించుకుందుకు రకరకాల పాట్లుపడే ఒక అమాయకుడున్నాడు పేపరులో పడిన పేరూ ఫోటోల బతుకు మహాఅయితే ఇరవై నాలుగు గంటలే. కాని... అతనికెంత వెర్రో?"

"ఈ సన్మానాలది మరీ అల్పాయువు. వేదిక మేరకే. ఐనా మనుషుల కెంత సన్మానపు పిచ్చో చెప్పలేం. నేను... విధిలేక... యీ బలహీనత మీదే బతకగలనేమో అని పరీక్షించుకున్నాను. తప్పే.

తప్పలేదు. బోర్డు పెట్టిన మరుసటి నెలనుంచీ నా ఆదాయం నాలుగంకెలని స్పృశిస్తూనే ఉంది. అంతేకాదు... నాకొక రకమయిన తృప్తీ వినోదమూ కూడా లభిస్తూ వొస్తున్నాయి".

"భుక్తి గడవడం తృప్తే..."

"నా భుక్తేం కాదు.. చూడు విరించీ... మధ్య తరగతి వాళ్ళం పదవీ విరమణ అనంతరం పడేపాట్లు పగవాడికి కూడా కోరదగనివి కదా? అందులోనూ అంతో యింతో డొక్కశుద్ధి కలవాళ్లకీ లక్ష్మీ కటాక్షం పూజ్యమే."

"ఔను"

"అలాటి వృద్ధులకి కొద్దో గొప్పో ఆదాయం కల్పించడం గర్వపడదగిన విషయమేకదా? నన్ను నమ్ముకుని ఒక వృద్ధ కవి గారున్నారు. సన్మానితుడికి పంచరత్నాలు. సన్మాన పత్రం వారే రాస్తారు. అందుకు నూట పదహార్లు. నెలకి కనీసం రెండు సన్మానాలు గ్యారంటీ. ఆంగ్లం జొప్పిస్తున్నాడేమిటీ అనుకోకు. ఉదర పోషణార్థం బహు కృత భాషాః. సన్మానాలు కొన్నిటికి మేమే జనాలని తోలుకు రావలసి ఉంటుంది. శాలువా కప్పుకొస్తే సభకి గొప్పతనం. కనుక శాలువావాలా ప్రేక్షకుడికి యిరవై. మామూలు వాడికి పదీ... సాయంత్రం ఓ గంట సభలో కూర్చున్నందుకు. అది హీనమేమీ కాదుగా?"

"కాదు కాదు. ఊరికే ఉండడం కంటే నయమే".

"మా ట్రూపులో పాదాభివందనాల స్పెషలిస్టు లిద్దరున్నారు."

"పాదాభివందనం రేటెంతా?" కుతూహలంగా అడిగాను.

"అర్ధనూట పదార్లు"

"బాగుంది"

"మా వల్ల వీడియో వాళ్లకీ... దండల వాళ్లకీ... మైకు, లైటింగు వాళ్లకీ, కాఫీల వాళ్లకీ పనులు పడుతూంటాయి..."

"ఫోటోగ్రాఫర్లకి కూడాను" జోడించాను.

"ఆఁ మరివాళ్లు మాకు కమీషనిస్తారు– రిపోర్టులు రాసినందుకు డాక్టర్లకి లేబొరేటరీ వాళ్లిచ్చినట్లు"

"సరే సరే. మీ ఆదాయ మార్గాలు బాగానే అర్థమయ్యాయి"

"అర్థమవనిదేమిటీ"

"మీ వృత్తి అదే... వ్యాపారం.. లోని... వినోదం..."

"గుర్తింపు అనేది దానంతటది రావలసింది. దానిని మనిషి వెదుక్కుంటూ వెంటపడడంలో ఎంత వినోదముంటుందో కళ్లారా చూస్తేనే తెలుస్తుంది. అనుభవైకవేద్యమన్న మాట"

"ఔను పెళ్లిలాగా సన్మానమూ ఒకరు చేస్తే బాగుంటుంది కాని ఎవరికి వారు చేసుకుంటే తాను తుమ్మి తానే చిరంజీవి అనుకున్న చందమే. మరి నాకటువంటి వినోదం ప్రాప్తింపజెయ్యవూ?" అర్థించాను. తెలుగు మాస్టారిగా చేసినవాడివి కదా? హాస్యమంటే చెవి కోసుకుంటాను. అందులోనూ సజీవ హాస్యమంటే చెప్పాలా?"

"నీకా అదృష్టమూ యోగమూ ఉన్నాయేమో. ఇది- సన్మానం కోరేవారు వొచ్చే వ్యాపార వేళే. నిరీక్షించగలవా?"

"ఓం పెళ్లి ముహూర్తం అర్ధరాత్రికి. భోజనాలేమో తొమ్మిదికి. కనుక అంతా తీరికే అంతవరకూ..." నేనంటూనే ఉన్నాను.

"సన్మానాల పతంజలిగారూ!" అంటూ ద్వారం వెలుపలి నుంచి కేక...

"కచ్చితంగా కేసే. నువ్వొచ్చిన వేళ మంచిది. ఊ... నీ పాత్ర' జాగ్రత్తగా పోషించు. ఎంత నవ్వొచ్చినా దాచుకోవాలే తప్ప నవ్వకూడదు." అని నాకు జాగ్రత్త చెప్పి "అఁ.. రండి రండి... స్వాగతం..." అంటూ ఆయన ద్వారం వేపు చూశారు.

తలుపు తోసుకుని ఒక ఆకారం ప్రవేశించింది. అతన్ని చూస్తూనే నా ఆశ అడుగంటి పోయింది. అతను రచయితలా కాని... రాజకీయ నాయకుడిలా కాని, వర్ధమాన కళాకారుడిలా కాని, ఉద్యోగిలా కాని ఎంత మాత్రమూ లేడు సరికదా అట్టే చదువుకోని అతి సామాన్యుడిలా... మొరటుగా ఉన్నాడు. ఇతనేం సన్మానం చేయించుకుంటాడూ? అతను లోపలికి వస్తూనే తలుపు గడియ వేసేశాడు. నాకైతే భయమేసింది మమ్మల్నిద్దర్నీ తన్ని ఉన్నదూడ్చుకు పోయేందుకొచ్చాడేమో అని. గుండెలుగ్గ బట్టుకున్నాను.

"నమస్కారమండి. నా పేరు కోదండమండి" అలా పరియం చేసుకున్నాడతను. ఆకారం భీకరమేకాని గొంతు కీచు. సంహానికి పిల్లికూతలు పెట్టినట్లుంది. నాకు ధైర్యమొచ్చేసింది. "సన్మానం మీకేనా?" రోగం మీకేనా అని డాక్టరడిగినట్టే అచ్చంగా.

కోదండం నావేపు చూశాడు అనుమానంగా.

పతంజలి... "ఫరవాలేదు.. మనవాడే" అని హామీ ఇచ్చాడు. ఇస్తూనే టేప్‌రికార్డర్ అన్ చేశాడు.

"నేను సార్ధకనామధేయుణ్నండి. ఎందుకంటే... నేను మావూళ్ళో దండలు కట్టి అమ్ముతానండి. దండలంటే దండలే కాదండి. బొకేలూ... అవీ అన్నీనండి. ఇప్పటికి నాచేత్తో కోటి దండలు కట్టుంటానండి. కోటిదండలు కట్టాను కనుక కోదండమన్న పేరు కరక్టే కదండి?" ఔనన్నట్లు తలూపి- మెల్లగా అడిగాడు పతంజలి. "స్వయం సన్మానమా లేక..."

"సొంత సన్మానమేనండి. ప్రపంచమంతా సోర్దమయమండి. శవాల నుంచి సీనియర్ మినిస్టర్లూ, సినిమా స్టార్ల వరకూ ఎందరి మెడల్లోనో పడ్డాయండి నేను చెమటోడ్చి కట్టిన చంకీదండలు. కాని అందరి కందరూ ఆళ్లు దండవేయించేసుకోడమే గాని, అయ్యో! ఇందరికిన్ని దండలందించిన కోదండం మెడలో ఒక దండ వేసి సన్మానం చేద్దామనుకున్న వాళ్లు ఒక్కరంటే ఒక్కరు లేరండి. ఎవరేనా సన్మానం చేస్తారేమో అని చూసి చూసి ప్రాణం విసుగెత్తిపోయి.. నాకొకళ్లు చేసేదేమిటి, నేనే చేసుకుంటానని మీ దగ్గరికి పారొచ్చినండి. నేను చాలా గొప్పవాణ్నండి. నలభయ్యేళ్లకే కోటి దండలు కట్టిన చేతులండి నావి. మన ప్రభుత్వం దండల నెగుమతి చెయ్యకకానండి, లేకపోతేనేను కట్టిన దండలకి ఫారిన్ చాన్సొచ్చి తీరేదండి కచ్చితంగా. ఆంధ్రదేశంలో... ఆరుకోట్ల జనాబాలో దండల కోదండాన్నెరుగని వారుండరండి. ఉంటే వాళ్లెందుకూ పనికిరాని వాళ్లనేనండి."

"నిజమే. మరి మీ సన్మానానికి మీరెంత ఖర్చు పెట్టగలరు?"

"ఎంతైనా సరే. కాని సన్మానం మాత్రం జాంజకార మెత్తిపోవాలండి. పదివేలయినా పర్లేదండి.

అన్నట్లు... దండలు నేనే యిచ్చి నా స్టేజీమీద నామెళ్లో వేయడానికి హారాలకి దారాల సప్లయి సంగమూ, టోకేలకి వెదురుపుల్లలందించే వారసోసియేషనూ, చంకీ కళాకారుల సమాఖ్యా దయతో అంగీకరించారండి. సన్మానం తేదీ పిక్సవాలే కాని... నా బార్యా పిల్లలతో యింటింటికీ వెళ్లి బొట్టు పెట్టి నా సన్మాన సభకి రావాలని మరీమరీ చెప్తామని ప్రమాణం చేశారండి. అలా నాకు సహకారమందుతుందండి. అన్నట్లు క్రోటనాకుల సరఫరా సంగం కూడా నా మెళ్లో దండేస్తుందండి – నేను కట్టిచ్చేదే అయినా..." వింటూనే ఏదో రాసేస్తున్నాడు పతంజలి. "మీరు కట్టిన దండలే మీ కంఠసీమనలంకరించడం... నిజంగా సృష్టి విచిత్రమే కోదండంగారూ. మన దేశంలోని ప్రతివొక్కరూ మిమ్మల్నాదర్శంగా తీసుకుంటే దేశం మూడు పువ్వులూ ఆరు దండలే." నిజమేమో అనిపించేంత సహజంగా అన్నాడు పతంజలి.

"పువ్వు లేకుండా దండకట్ట గలననే చమత్కారిననుకుంటే నన్నుమించిన వాళ్లాగున్నారండీ మీరు. అన్నట్లు... జనానికి పర్లేదండి. నలుగురి కాళ్లూ పట్టుకునయినా సభకి తెచ్చుకుంటాను. కాఫీలూ, విడియో ఉంటాయని రాస్తాంగా పేపరులో... అనీ బాగా వస్తేస్తుందండి. నా మెళ్లో దండవేసి సన్మానం చేసేవాళ్లకి ఉచితంగా దండలివ్వడే కాకుండా – దండేసినందుకు తాంబూలంలో ఐదో పదో పెట్టి యిస్తానని కూడా రాద్దామండి కరపత్రంలో..."

"డబ్బుకంటె సినిమా టిక్కెట్టయితే యింకా బాగుంటుందేమో?"

"బలే అయిడియా! నా బుర్రకి తట్టనే లేదండి. మీరన్నట్లే చేద్దామండి."

అంతలో ఎవరో వచ్చారు పండితుడిలాటి వారు. తాను రాస్తున్న కాగితం ఆయనకందించి–

"కోదండం గారూ! మరి... సన్మాన పత్రమూ... బిరుదు ప్రధానమూ..."

"అవి లేకుండా సన్మానసభేంటండి? తాళిలేని పెళ్లిలా... సోడాలేని సారాలా..."

"సర్లే, పుల్లేనన్నమాట. ఐదువేలు అడ్వాన్సివ్వండి."

రొంటిలోంచి తీసి యిచ్చేశాడు కోదండం. నాకు నవ్వూ ఆగడం లేదు, ఆశ్చర్యమూ ఆగడం లేదు. దండలు కట్టేవాడికీ సన్మానకండూతే! సన్మానం కోసం ఐదువేలూ ఎంత తేలికగా యిచ్చేశాడూ! పతంజలి, కోదండం వివరాలు రాసుకుని... పంచాంగం చూసి సన్మానతేదీ నిర్ణయించాడు. ఈ లోగా యిందాకటి పండితుడుగారు వచ్చారు. "సన్మాన పత్రమూ బిరుదూ చిత్తగిస్తారా?" అన్నాడు తన చేతిలో అరటావు కాగితం పట్టుకుని.

"చదవండి. విని మాకు చేతనయితే మెరుగులు దిద్దుతాం. శ్రద్ధగా వినండి కోదండం గారూ..."

"ఏమిటి? అప్పుడే నా సన్మాన పత్రం రాసేశారా! నేను దండ కట్టినకంటె చురుగ్గా కట్టారే... చదవండి చదవండి..." ఉత్సాహపడిపోయాడు.

పండితుడు చదవసాగాడు. "నేటి సన్మానితులు కోదండంగారి నెరుగనివారాంధ్ర దేశంలో ఉండరు. తన చేతులతో కోటి దండలల్లి జననీ జనకులు పెట్టిన కోదండమనే పేరును సార్థకం చేసుకున్న కోదండం గారు ఉరఫ్ దండల కోదండం గారు, భారతమాతకు ముద్దుబిడ్డలూ, గర్వకారణమూ అంటే అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు. వీరి దండ పడితేనే కాని శవం శ్మశానానికి లేవదు, వధూవరుల పల్లకీ ఊరేగింపుకీ లేవదూ; రాజకీయ నాయకుడు ప్రచారానికీ కదలరు. సినిమా వాళ్లు

స్పీచీ యివ్వరు ఒకసారి వీరల్లిన పెద్దదండ మోయలేక సన్మానితుడు మూర్ఛపోయాడు. పూలూ దీరమూ కూడా లేకుండా దండలు కట్టగలిగిన మహామాలీ కళాకారులు దండల కోదండం గారు. కేశాలు తెల్లబడకుండానే కోటి దండలు కట్టిన కోదండం గారు కచ్చితంగా గిన్నిస్ బుక్కెక్కవలసిందే దండలు కట్టడమనే కళలో కాకలు తీరినవారు వీరు. ఎవరికి సన్మానం చేయాలన్నా ముందుగా వీరి అండదండలుండి తీరవలసిందే. మాలకట్టడమంటే మాటలతో పనికాదు. పువ్వులతో పని. సున్నితమూ సుందరమూ సుగంధమూ కల పువ్వులతో పని! పువ్వులంటే దేవుని నవ్వులే. కనుక మాలంటే పువ్వుల నవ్వులు.... నవ్వుల పువ్వులు...పువ్వుల పువ్వులు... నవ్వుల నవ్వులు...

ఇటువంటి గొప్ప కళాకారుడయిన కోదండంగారికి... దండల కోదండం గారికి... పురజనులు అభిమాన పురస్కారంగా "దండోద్దండ" అనే బిరుదును ప్రదానం చేయడం - కోదండం గారికి సన్మానించడం కాక తమని తాము గౌరవించుకోడమే. ఇకపై వీరు దండోద్దండ కోదండం గారుగా వ్యవహరించబడతారు. దండోద్దండ కోదండం గారికీ - "

"జై...." అని మాతోపాటు కోదండం కూడా అరిచేశాడు.

"సన్మాన పత్రం, బిరుదూ... అదిరిపోయాయండి. పండితుల వారికి నా ప్రత్యేక కానుక..." అంటూ జేబులోంచి వంద రూపాయల నోటు తీసి యిచ్చేశాడు కోదండం మహోత్సాహంతో.

"ఈ పత్రానికి మంచి ఫారిన్ ఫ్రేము కట్టించాలండి... నేనే కట్టించుకుంటాలెండి. మీకెందుకు శ్రమ. ఆ... మరి సన్మానం ఖరారైపోయినట్లే కదా?" అంటూ లేచాడు.

"ఇంకా సందేహమెందుకూ? సన్మానం సూర్యోదయమంత తథ్యం..."

"ఎలాగూ తెచ్చాను. ఈ ఐదువేలూ కూడా ఉంచండి. మీమీద నాకు నమ్మకమే. సన్మానం మాత్రం గొప్పగా అదిరిపోవాలి. మన తడాఖా తెలిసి రావాలి నలుగురికీ" అంటూ దండలు చరుచుకున్నాడతను.

నాకు నిజంగా మతిపోయింది. తన బతుకుతెరవు కోసం దండలు కట్టే వృత్తి చేపట్టాడు కోదండం. తన పనికి - అది శ్రమే అయినా కళే అయినా ప్రతిఫలమూ పొందాడు. మరి యీ సన్మానంలో అర్థమేమిటి? ఈ లెక్కన రిక్షా తొక్కే కళాకారుల మంటూ రిక్షావాళ్లూ, కూరగాయలమ్మేవాళ్లూ,... ఎవరేనా సన్మానార్హులే అన్నమాట. కనీసం స్వయం సన్మానానికేనా.

"మర్నేనెళ్తాను." అంటూ లేచాడు దండోద్దండుడు కోదండం. నాకూ దండం పెట్టి వెళ్లాడు.

పతంజలి నన్ను చూసి నవ్వుతున్నాడు.

"నాకూ సెలవిప్పించు..." అంటూ లేచాను.

"పదవీ విరమణ చేశాన్నావు. అదేలే చేయించారు ప్రభుత్వంవారు. సంపాదించవలసిన అగత్యమే వొస్తే- యిక్కడికి వొచ్చెయ్. ఇది పుష్పక విమానమే. సంకోచం అక్కర్లేదు."

వెర్రి మొహం వేసి- అలాగే అన్నట్లు తలూపి రోడ్డు మీద పడి నడవసాగాను. నాకేమిటో అయోమయంగా ఉంది. మనసు కలచివేసినట్లుంది. జరిగింది నిజమేనా లేక కలా అని అనుమానం వొస్తూంది.

మనిషి - గుర్తింపు కోసం - తనని తానింతగా వంచించుకొని దిగజారతాడా! సన్మనం కోసం యింత వెర్రిగా వెంపర్లాడతాడా!

ఐతే... నేను చూసిన... హాజరయిన... సన్మానాలన్నీ కాకపోయినా... వాటిల్లో అధిక శాతమయినా... యిలాటి స్వకపోలమర్దనాలేనా?

ఒక్కసారెందుకో వెనక్కి తిరిగి చూశాను.

"డీలక్స్ సన్మాన కేంద్ర్..." బోర్డు దివ్యంగానూ జాజ్జ్వలంగానూ వెలిగిపోతోంది.

మనుషులలో గుర్తింపు పిచ్చి ఉన్నంత కాలమూ నేనిలాగే వెలిగి పోతుంటాను సుమా - అని నన్ను చూసి నవ్వుతున్నట్లే ఉండా బోర్డు.

ఆ క్షణంలో నేనొక నిర్ణయం తీసుకున్నాను.

ఒకవేళ... ఎవరయినా..... పొరపాటున నాకు సన్మానం చేస్తామన్నా... చచ్చినా తలవొంచకూడదు.

✡ ✡ ✡ ✡ ✡

# మాయా - మర్మమూ

చీకటి పడిపోయింది.

శ్రీకాకుళం బస్స్టాండు ఆట అయిపోయాక టెన్నిస్ కోర్టులా బోసిగా మిగిలిఉంది. పాసింజర్లూ సామానులూ లేక ఖాళీగా పడుకున్న బస్సులు పగటివేళ ప్రాస్టిట్యూట్స్‌లా పరమ వికారంగా ఉన్నాయి.

ఒక మూల ఒక బస్సు మాత్రం కిటకిటలాడిపోతూంది. కన్నెపిల్లలా పిటపిటలాడుతోంది. రంగు దీపాలతో - డిజైన్ల చీరకట్టిన చిన్నదానిలా మిడిసిపడుతోంది. ఆ బస్సు-దర్జాగా ఉంది. ధీమాగా ఉంది. ఆ కొత్తబస్సు, గతంలో కొంచెం అనుభవం చవిచూసి శోభనం గదిలోకి ఉరికెయ్యడాని కుల్లాసపడుతున్న వయసు పెళ్లికూతుర్లా ఉంది.

ఆ బస్సుమీదకు జనం ఎగబడుతున్నారు.

ఎవరికి వారే ఆ బస్సెక్కెయ్యాలని తాపత్రయ పడిపోతున్నారు. ఆరాటపడుతున్నారు. ఆందోళన పడుతున్నారు.

విశాఖపట్నానికి అది ఆఖరుబస్సు. కండక్టరు - కలక్టరమ్మ మొగుడిలా సీటులో కూర్చుని బస్సులోంచే టిక్కెట్లమ్ముతున్నాడు. జనం ఒకరి నొకరు తొక్కుకుంటున్నారు. తోసుకుంటున్నారు. ఇళ్లు కాలుతూంటే కోడి పెట్టల దొంగల్లా ఆ జనంలో కేటుగాళ్లు, కేడీగాళ్లూ కూడా లేకపోలేదు. పాసింజర్లు టికెట్లకోసం కండక్టర్ని ప్రాధేయపడుతున్నారు. ప్రార్థిస్తున్నారు. ఆత్రతతో కూడిన చిరునవ్వులు విసిరి చూస్తున్నారు. బస్సు తలుపులేసి ఉండటాన కండక్టరుగారి కాళ్లందక చేతులే పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

టిక్కెట్లమ్మేసి, బస్సుదిగి, డ్రయివరు భుజంమీద చెయ్యివేసి విలాసంగా కాఫీ హోటలు వేపు నడవసాగాడు కండక్టరు.

మళ్లీ పాసెంజర్లు - అభిమాన సంఘాలు ఆరాధ్య నటుడ్ని వదలనట్లు గుమిగూడుతున్నారు.